పోడుభూముల పంపిణీపై
సమగ్ర వివరాలు అందించాలి

- మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క

నాగర్‌కర్నూల్, ఆగస్టు 17: పోడు వ్యవసాయం చేసే రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, వారి ఉపాధికి భంగం కలుగకుండా అటవీశాఖ మార్గదర్శకాలను అనుసరిస్తూ పోడు భూముల రక్షణకు కృషి చేయాలని అటవీ, పర్యావరణ, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు అధికారులను ఆదేశించా రు. పోడు భూముల పంపిణీకి సంబంధించిన సమగ్ర వివరాలను అందించాలని సు రేఖ కలెక్టర్లకు సూచించారు. ఆయా జిల్లా ల్లో ఇప్పటి వరకు పోడుభూముల పట్టాల కోసం వచ్చిన క్లైమ్‌లు ఎన్ని, వాటిలో ఎంత మందికి ఎన్ని అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. అందుకు గల కారణాలు, పట్టాలు పొందిన వారికి భూమి హద్దులు చూపించారా తదితర వివరాలను ఒక్కో జిల్లా వారీగా అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు రెండు విడతలుగా రాష్ట్రంలో పోడు భూముల పట్టాల పంపిణీ జరిగినప్పటికీ, పలు చోట్ల గిరిజనుల నుంచి వినతులు వస్తున్నాయన్నారు. నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన కుటుంబాలకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పోడు భూముల, పట్టాల పంపిణీకి సంబంధించిన పూర్తి వివరాలను నిర్ణీత గడువులోగా పంపించాలని సూచించారు. కలెక్టర్ సంతోష్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ప్రభుత్వ, మార్గదర్శకాల మేరకు పోడు భూముల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలోని కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల పరిధిలో పోడు భూముల్లో సుదీర్ఘ కాలంపాటు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్న ఆవరిని గుర్తించి వారికి తగిన న్యాయం జరిగేలా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలు తీసుకొని చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా అవీశాఖాధికారి రోహిత్ గోపిడి, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి ఫిరంగి పాల్గొన్నారు.

పేద విద్యార్థులను పాఠశాలలో చేర్పించిన నాయకుడు

కల్వకుర్తి, ఆగస్టు 17 : కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామంలో ఇద్దరు పేద విద్యార్థులను శనివారం బీఆర్ఎస్ నాయకుడు సురేశ్‌గౌడ్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించాడు. ఆంధ్ర నుంచి బతుకుదెరువు కోసం నారాయణ అనే వ్యక్తి తర్నికల్ గ్రామానికి వచ్చాడు. అతనికి కొడుకు వరుణ్ తేజ్(8) కూతురు చెంచులక్ష్మి ఉన్నారు. వారిది పేద కుటుంబం కావడంతో పిల్లలు ఇద్దరు తండ్రికి సహాయంగా ఉన్నారు. విషయం తెలుసుకున్న సురేశ్‌గౌడ్ నారాయణకు నచ్చజెప్పి పిల్లలను స్థానిక ప్రాథమిక పాఠశాల్లో చేర్పించి దుస్తులు, పుస్తకాలు ఇప్పించాడు. కార్యక్రమంలో హెచ్ఎం విజయకుమార్, ఉపాధ్యాయురాలు రాజేశ్వరీ ఉన్నారు.

విధులు బహిష్కరించిన వైద్యులు

- జిల్లా అంతటా నిలిచిన వైద్య సేవలు..!
- నిరసన తెలిపిన వైద్య సిబ్బంది
- కందనూలు అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా, ఆందోళన

నాగర్‌కర్నూల్, ఆగస్టు 17: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచార ఘటనకు నిరసనగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనను నిరసిస్తూ శనివారం జిల్లా అంతగా ప్రభుత్వ, ప్రైవేట్ డాక్టర్లు విధులు బహిష్కరించి నిరసనలకు దిగారు. జిల్లా కేంద్రంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ చెన్నయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో డాక్టర్లు ధర్నా చేపట్టారు. అంతకుముందు విధులు బహిష్కరించిన డాక్టర్లు దవాఖాన ఎదుట నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. జిల్లా దవాఖానలో ఓపీ నిలిచిపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం తర్వాత ఓపీని ప్రారంభించారు. అత్యవసర సేవలు మాత్రమే కొనసాగాయి. ఈ సందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించి జిల్లా దవాఖాన నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. పలువురు డాక్టర్లు మాట్లాడుతూ జూనియర్ మహిళ డాక్టర్‌పై అత్యాచారం క్షమించరానిదని మండిపడ్డారు. చదువుకోవాలని ముందుకొచ్చిన వైద్య విద్యార్థులపై ఇలాంటి అఘాయిత్యాలు జరగడం సిగ్గుచేటన్నారు. ముమ్ముందు ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ చెన్నయ్య, కార్యదర్శి రమేశ్‌చంద్ర, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, వైద్య విద్యార్థులు ఉన్నారు.

నాగర్‌కర్నూల్ అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న డాక్టర్లు

కల్వకుర్తిలో..

కల్వకుర్తి రూరల్, ఆగస్టు 17 : కోల్‌కత్తాలో ఆర్‌కే కేఏఆర్ దవాఖానలో వైద్యురాలిపై జరిగిన దుర్ఘటనకు పాల్పడిన నిందితులను ఉరితీయాలని కల్వకుర్తి ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ శివరాం, వైద్యులు డిమాండ్ చేశారు. శనివారం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో వైద్యులు, వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు పట్టుకుని నిందితులను పట్టుకుని వెంటనే ఉరి తీయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాములునాయక్, యశోద, విష్ణు, షకీల్, ప్రభావతి, మెర్సీ, సత్యం, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తి రూరల్ : ప్రభుత్వ దవాఖానలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

లింగాల సీహెచ్‌సీలో నిరసన తెలుపుతున్న వైద్యాధికారులు

లింగాలలో..

లింగాల, ఆగస్టు 17 : జూనియర్ మెడికల్ విద్యార్థిపై అత్యాచారం జరిపి ఆపై హత్య చేసిన నిందితులను శిక్షించాలని స్థానిక సీహెచ్‌సీ, మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శివశంకర్ మాట్లాడుతూ ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాలలో పీజీ చదువుతున్న వైద్యాధికారిణిపై లైంగిక దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని కోరుతూ ఇండియన్ మెడికల్ అసోషియేషన్ పిలుపు మేరకు విధులను బహిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రైవేట్ క్లినిక్స్‌లు కూడా పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అనిల్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణను పక్కాగా చేపట్టాలి

నాగర్‌కర్నూల్, ఆగస్టు 17: ఓటర్ల జాబితా సవరణను పక్కాగా చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషన్ సుదర్శన్‌రెడ్డి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటరు జాబితా సవరణపై దిశానిర్దేశం చేయగా కలెక్టరేట్ నుంచి కలెక్టర్, అధికారులు హాజరయ్యారు. హేతుబద్ధంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధం కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్(ఎస్ఎస్ఆర్-25)లో భాగంగా బూత్‌స్థాయి అధికారుల(బీఎల్‌వో) ద్వారా ఇంటింటా జాబితాల పరిశీలన చేపట్టాలన్నారు. ప్రతి ఏటా జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ 1 తేదీల్లో కొత్త ఓటర్ల నమోదు చేపడుతున్నట్లు వివరించారు. యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆర్డీవోలను ఆదేశించారు. బూత్‌స్థాయి అధికారులకు శిక్షణను అందించి ఇంటింటి సర్వే చేపట్టాలని సూచించారు. ఎస్ఎస్ఆర్-2025లో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, చిరునామాల మార్పు, చేర్పుల్లో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. జాబితాలో ఫొటో తప్పుగా నమోదు అయిన వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. స్పెషల్ సమ్మరి రివిజన్‌పై వచ్చే ఆదేశాలను పాటించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సీతారామారావు, దేవసహాయం, ఆర్డీవోలు పాల్గొన్నారు.

వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్

గిరిజన తండాలాభివృద్ధికి కృషి చేస్తా

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ ఆగస్టు 17 : గిరిజన తండాల అభివృద్ధికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. శనివారం వెల్దండ మండలం సిలోని బావితండాలో నిర్వహించిన గిరిజనుల ఆరాధ్య దైవమైన మున్నాసాద్ పండుగ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజన ప్రజలు ఆయనకు డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మున్నాసాద్ బోనాలను ఆడపడుచుల నెత్తిన పెట్టి పండుగ వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్‌కుమార్, ఎండీ ఆలీ, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

మున్నాసాద్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కశిరెడ్డి

మల్లయ్యకు ప్రత్యేక పూజలు

కొల్లాపూర్, ఆగస్టు 17 : దట్టమైన నల్లమల అభయారణ్యంలో కృష్ణానది ఒడ్డున వెలసిన అతిప్రాచీనమైన శివాలయం వద్ద శ్రావణమాస శనివారంతోపాటు తొలిఏకాదశి అనంతరం నిర్వహించే నెల పూజలు ఘనంగా నిర్వహించారు. అమరగిరి నుంచి భక్తులు 3 కిలోమీటర్లు బోటులో ప్రయాణించి శివుడిని దర్శించుకొని స్వామివారికి బిల్వార్చనలతోపాటు అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

గోవిందా నామస్మరణలో సింగోటం

కొల్లాపూర్ మండలంలోని సింగోటం లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. భక్తులు తెల్లవారుజామున నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు సంపత్‌కుమార్ శర్మ, సతీశ్ శర్మల ఆధ్వర్యంలో అభిషేకాలు చేపట్టారు. అదేవిధంగా సతీశ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ రమేశ్‌నాయడు, సింగిల్ విండో చైర్మన్ కృష్ణయ్య, కౌన్సిలర్ రాముడు, మాజీ సర్పంచ్ నిరంజన్, రైతు, చెంచు సంఘాల నాయకులు కుర్వ మల్లయ్య, క్రాంతి, అంబన్న, కురుమన్న, ఆశోక్, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీటీసీకి ఎమ్మెల్యే పరామర్శ

చారకొండ, ఆగస్టు 17 : మండలంలోని జూపల్లి మాజీ ఎంపీటీసీ బాలస్వామి అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి శనివారం దవాఖానకు వెళ్లి బాలస్వామిని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే కోరారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, రాములుయాదవ్, పుల్లారావు ఉన్నారు.

పేదలందరికీ ఇండ్ల స్థలాలు, సాగుభూములు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్

పెంట్లవెల్లి, ఆగస్టు 17 : మండలంలోని నిరు పేదలందరికీ ఇండ్ల స్థలాలు, సాగు భూములు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సీపీఎం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జటప్రోల్, గోప్లాపురం, కొండూరు, ఎంగంపల్లి తండా, సింగవరం, పెంట్లవెల్లి గ్రామాల్లో ఉన్న ఇండ్ల స్థలాలను, సాగు భూములను నిరుపేదలకు పంచాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుపేదలను పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుపేదలందరికి ఇండ్ల స్థలాలతో పాటు సాగు భూములను పంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు హనుమంతు, శ్రీనివాసులు, ఎల్లగౌడ్, తిమ్మస్వామి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వర్

కేసులు నమోదు

బల్మూరు, ఆగస్టు 17 : మండలంలోని గట్టుతుమ్మెన్ గ్రామానికి చెందిన రాజుపై గొడలితో దాడి చేసి తీవ్రంగా గాయ పర్చిన గ్రామానికి చెందిన యాదయ్య, మల్లయ్య, జయమ్మలపై బాధితుడి తండ్రి తిరుపతయ్య శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై గురుస్వామి తెలిపారు. ఈ మేరకు యాదయ్య, మల్లయ్య, జయమ్మలపై తిరుపతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

అచ్చంపేటరూరల్, ఆగస్టు 17: అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నిర్మల అధ్యక్షతన మండల కమిటీ సమావేశంలో స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 64లక్షల మందికి రుణామాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైదన్నారు. సమావేశంలో నాయకులు వెంకటయ్య, సైదులు, రజిత, బక్కయ్య పాల్గొన్నారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి, ఆగస్టు 17 : కాంగ్రెస్ ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని మాజీ సర్పంచ్ జంగయ్య డిమాండ్ శనివారం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేసిన రుణమాఫీలో 60 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. బ్యాంకులో పంట రుణం ఉన్న ప్రతి రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం కొర్రీలు పెట్టడం తగదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రుణమాఫీ కాని రైతులకు ఎప్పటి వరకు రుణమాఫీ చేస్తారో నిర్దిష్టమైన తేదీని ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

24 మేకలు మృతి

అచ్చంపేటటౌన్, ఆగస్టు 17 : అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం బీకే తిరుమలాపూర్ గ్రామంలో పిడుగుపాటుకు 24 మేకలు మృతి చెందాయి. బీకే తిరుమలాపూర్ గ్రామానికి చెందిన రైతు నల్ల శ్రీశైలం కథనం మేరకు గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో మేకలను మేపేందుకు తీసుకెళ్లానని, అదే సమయంలో సాయంత్రం భారీ వర్షం కురుస్తూ పిడుగు పడడంతో 24 మేకలు అక్కడిక్కడే మృతి చెందాయని తెలిపారు.

బియ్యం పట్టివేత

కల్వకుర్తిరూరల్, ఆగస్టు 17 : కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామంలో ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని కల్వకుర్తి పోలీసులు పట్టుకుని శనివారం సీజ్ చేశారు. కల్వకుర్తి పట్టణ రెండో ఎస్సై రాంచందర్‌జీ వివరాల ప్రకారం ఎల్లికల్ గ్రామంలో శివకృష్ణ ఇంట్లో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేశాడన్న పక్కా సమాచారంతో శుక్రవారం రాత్రి దాడి నిర్వహించి ఇంట్లో నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసి పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకుని పంచానామా నిర్వహించమని ఎస్సై తెలిపారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

బియ్యం, సరుకులు పంపిణీ

వెల్దండ, ఆగస్టు 17 : మండలంలోని కొత్రలో నీరటి మంగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం విషయం తెలిసిన కొత్ర గ్రామసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్ రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

శ్రద్ధ చూపితే చదువుల్లో రాణిస్తారు

- జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు

లింగాల, ఆగస్టు 17 : విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపితే చదువుల్లో రాణిస్తారని జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులు ఆరోగ్యం పట్ల తీసుకొవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం చేసే ముందు చేతులను శుభ్రం చేసుకొవాలన్నారు. ముఖ్యంగా తడి దుస్తులు వేసుకొవడంతో తామర గజ్జి వంటి రోగాలు వస్తాయన్నారు. అదేవిధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరి చేరవన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని పాఠశాల ప్రత్యేకాధికారిణి శారదను సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శివశంకర్, ప్రశాంత్‌కుమార్, అనిల్‌కుమార్ ఉన్నారు.

వంట గదిని పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు

అచ్చంపేటలో నిరసన తెలుపుతున్న హిందూ సంఘాల నాయకులు

బంద్ సంపూర్ణం

అచ్చంపేటటౌన్/బిజినేపల్లి/బల్మూరు, ఆగస్టు 17 : అచ్చంపేటలో హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అచ్చంపేట, బిజినేపల్లి, బల్మూరు మండలాల్లో శనివారం బంద్ సంపూర్ణంగా ముగిసింది. ఆయా గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ర్యాలీ లో పాల్గొన్ని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ హిందువులపై అరాచకాలు, హత్యాచారాలు, మారణహోమాలు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో హిందువులపై ఎక్కడ దాడులు జరిగినా మనందరం స్పందించాలన్నారు. ప్రపంచంలోని హిందువులను రక్షించుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా హిందువు సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 17: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రక్షాబంధన్‌ను పురస్కరించుకొని శనివారం స్థానిక శిశుమందిర్ పాఠశాలకు చెందిన చిన్నారులు కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ సీతారామారావులకు రాఖీలు కట్టారు. అనంతరం కలెక్టర్ చిన్నారులతో ముచ్చటించారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా సాధికారిత సాధించేందుకు ప్రతి సోదరుడు, మహిళలకు చేయూత అందించేందుకు ప్రతి సోదరుడు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆత్మీయుల మధ్య ఐకమత్యానికి చిహ్నంగా రాఖీ పండుగ జరుపుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అటవీశాఖాధికారి రోహిత్ గోపిడి, డీఈవో గోవిందరాజులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ : కలెక్టర్‌కు రాఖీ కడుతున్న చిన్నారులు

అచ్చంపేటలో..

అచ్చంపేటటౌన్, ఆగస్టు 17 : అచ్చంపేట పట్టణంలోని పలు పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించినట్లు విద్యార్థి సేన ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు ఎడ్ల మారతి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ భారతదేశం సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అన్నారు. ప్రపంచ దేశాలకు కట్టు, బొట్టు నేర్పిన గొప్పతనం దేశానికి దక్కుతుందన్నారు. రక్షాబంధన్ పండుగ ప్రతి ఒక్కరూ ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు రాఖీలను కట్టించి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో భారతీయ విద్యార్థి సేన నాయకులు, యువసేన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవపూజ అఖిల్, రమావత్ రాహుల్ పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తిరూరల్, ఆగస్టు 17 : కల్వకుర్తి పట్టణంలోని ఎస్‌పీఆర్ పాఠశాలలో రాఖీ పూర్ణిమ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని నీవు నాకు రక్ష నేను రక్ష అంటూ సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

అచ్చంపేటటౌన్ : రక్షాబంధన్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కల్వకుర్తిరూరల్ : రాఖీలు కట్టుకుంటున్న చిన్నారులు

నేడు మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి వర్ధంతి

కల్వకుర్తి, ఆగస్టు 17 : కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక వైఆర్ఆర్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ కల్వకుర్తి మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్ శనివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎడ్మ కిష్టారెడ్డి అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

చెక్కులు అందజేత

బల్మూరు, ఆగస్టు17 మండలంలోని గోదల్, బల్మూరు గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను నాయకులు వెంకట్‌రెడ్డి, ఖదీర్, రమేశ్, పంబరాధాకృష్ణలు అందజేశారు. బాధితులు శ్రీనివాసులు, చిన్నమ్మ, శ్రీధర్ రెడ్డి, ప్రమీల, సత్యనారాయణలకు మంజూరైన చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, ఫాజీల్ ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

వినతిపత్రాన్ని అందజేస్తున్న పాడిరైతులు

కల్వకుర్తిరూరల్, ఆగస్టు 17 : పాడిరైతులకు పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పాడి రైతులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం కల్వకుర్తి పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాడి రైతులు మాట్లాడుతూ పాడిరైతులకు పాల బిల్లులను పెండింగ్‌లో ఉంచడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బిల్లులను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పాల శీతలీకరణ కేంద్రంలో అధికారికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులకు పాడి రైతులు వినతి పత్రాన్ని అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్య

లింగాల, ఆగస్టు 17 : ఖర్చులకు డబ్బులు ఇవ్వడం లేదని భార్య పిల్లలతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న శనివారం చోటు చేసుకున్నది. ఎస్సై జగన్‌మోహన్ కథనం మేరకు మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన అతినారపు తిరుపతయ్య (50) ఈనెల 14వ తేదీన ఖర్చులకు డబ్బులు ఇవ్వడం లేదని భార్యపిల్లలతో గొడవపడి లింగాలకు వెళ్లి గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు లింగాలకు వచ్చి కొత్తబస్టాండ్‌లో వెతకగా అక్కడ కన్పించడంతో నాగర్‌కర్నూల్ ఏరియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. భార్య కృష్ణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
★జడ్చర్ల టౌన్‌లో @ DTCP, RERA అప్రూవ్డ్ వెంచర్‌లో వెంటనే ఇళ్ళు కట్టుకోవడానికి అనువైన ప్లాట్స్, సీసీ రోడ్స్, బ్యాంక్ లోన్‌తో కలవు. 6309977999
NT- 40

KIDNY STONES
★మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం. అనుభవంతో 100% గ్యారంటీ, జయమూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నం. 1058, తార్నాక